# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 29, మే 2026




# సబ్సిడీపై జీలుగ విత్తనాలు

* విత్తనాల పంపిణీని ప్రారంభించిన మంత్రి వివేక్
* రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ బానోత్ ప్రసాద్ సూచన

చెన్నూరు, మే 28, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని స్థానిక పీఏసీఎస్ వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి వివేక్ వెంకట స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఏడిఏ బానోతు ప్రసాద్ మాట్లాడుతూ జీలుగు పొలాల్లో ఎరువుగా పనిచేస్తుందని, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ప్రస్తుతానికి మొత్తం 250 క్వింటాళ్ల విత్తనాలు, (833) బ్యాగులు) అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించబడుతుందని తెలిపారు. ఒక బ్యాగు రెండున్నర ఎకరాలు (ఒక హెక్టార్) కి సరిపోతుందని, ఒక బ్యాగులో 30 కిలోల విత్తనాలు ఉంటాయన్నారు. బ్యాగ్ ధర రూ. 4,905.00 ఉండగా ప్రభుత్వ సబ్సిడీ ద్వారా రైతుకు రూ.2,452.50 వస్తుందని తెలిపారు. జీలుగా విత్తనాలు కావలసిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. విత్తనాలకు వచ్చే క్రమంలో ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఎ. యామిని, మండల విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ

# వేగంగా నిర్వహించాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 28, ప్రభాతవార్త



ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని, ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ ప్రాంతంలో గల మునీందర్ అండ్ బ్రోస్ ఫర్టిలైజర్స్ గోదాంను అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం దిగుమతి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాకు చెందిన ధాన్యం నిల్వ చేసేందుకు గోదాము కేటాయించడం జరిగిందని, ధాన్యం దిగుమతి వేగంగా నిర్వహించాలని, అవసరమైన మేరకు హమాలి సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. వచ్చే నెల 7వ తేదీ నుండి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున, ఈలోగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఎస్పీఎం కార్మికుల పోరాటానికి విశ్రాంతి ఉద్యోగుల అండ

* స్థానిక కార్మికుల హక్కుల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయండి
* పూర్తి మద్దతు ప్రకటించిన నాయకులు

కాగజ్‌నగర్ రూరల్, మే 28, ప్రభాతవార్త :

సిర్పూర్ పేపర్ మిల్లు (ఎస్పీఎం) కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఎస్పీఎం గేటు ముందు కొనసాగుతున్న దీక్షలు గురువారంతో 9వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న కార్మికులను పూలహారాలతో సత్కరించి తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ, ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. నాన్‌లోకల్ కార్మికులను బేషరతుగా బయటికి పంపించి, స్థానిక కార్మికులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. పనిచేస్తున్న కార్మికులకు న్యాయమైన హక్కులు, వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు పూర్తి స్థాయిలో జీవో అమలు చేయాలని పేర్కొన్నారు. విధుల్లోకి తీసుకోలేని పెర్మనెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడానికి అడ్డుగా జేకే యాజమాన్యం హైకోర్టు నుండి తెచ్చుకున్న స్టేను రద్దు చేసి వెంటనే పని కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, కార్మికులు చేపడుతున్న ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసినా తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 9వ రోజు రిలే నిరాహార దీక్షలో గోలెం వెంకటేశం, సి. వెంకటేష్, గోగర్ల రాములు, అంగళ శ్రీనివాస్, తాటి వెంకటేశ్, మోర్లే నానాజీ పాల్గొన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో మిగతా 2లో..

# మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తా..

* ప్రజలంతా కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి
* బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి వివేక్ వెంకటస్వామి

చెన్నూరు, మే 28, ప్రభాతవార్త

మైనార్టీ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో రాష్ట్ర గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ నియోజకవర్గ మైనార్టీ సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ముస్లిం మైనార్టీల అభివృద్ధి కొరకు ప్రత్యేక నిధులు వచ్చే విధంగా చూస్తామన్నారు. పట్టణంలో కమ్యూనిటీ హాల్, కబ్రస్తాన్, తదితర అభివృద్ధి కార్యక్రమాలు తన హయాంలో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రజలంతా పండుగ వేడుకలను కలిసి మెలిసి కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు.



# ఎస్పీఎం కార్మికుల పోరాటానికి విశ్రాంతి ఉద్యోగుల అండ

(మొదటిపేజీ తరువాయి)

సిర్పూర్ నియోజకవర్గ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ మూలకల సుభాష్, జిల్లా ఉపాధ్యక్షులు మురళీధర్ రావు, జిల్లా సంయుక్త కార్యదర్శి పురుషోత్తం, సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు జయదేవ్ అబ్రహం, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు చంద్రమోళి, ఆర్థిక కార్యదర్శి అంకయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె. నరసయ్య, జాయింట్ కార్యదర్శి వినోద్ కుమార్, బీజేపీ నాయకుడు పాల్వాయి అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగ...

**ఆసిఫాబాద్, మే 28, ప్రభాతవార్త :**



త్యాగం, భక్తి, సోదరభావానికి ప్రతీకగా బక్రీద్ పండగ జరుపుకుంటారని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొంటూ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండగను పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ అహ్మద్ కు చైర్మన్ ఆకాష్, ఎమ్మెల్యేలు స్వీట్స్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింల పవిత్ర పండుగలలో ఒకటైన బక్రీద్‌ను ఈద్‌ఉల్అజ్హా అని కూడా పిలుస్తారని, ఈ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకుంటారన్నారు. ఈద్గా వద్ద డిసిసి చైర్మన్ సుగుణ చేరుకొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగ మనుషుల మధ్య మానవత్వం, దాతృత్వం, పరస్పర గౌరవం పెంపొందించే సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.

# రైతు గోస బీజేపీ భరోసా యాత్ర

## అన్నదాతకు అండ

### - ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**సారంగాపూర్, మే 28, ప్రభాతవార్త:**

రాష్ట్రంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఖిరైతు గోస బీజేపీ భరోసాఖి బస్సు యాత్ర అన్నదాతలకు అండగా నిలుస్తోందని ఆ పార్టీ శాసనసభా పక్ష నేత (బీజేఎల్పీ) ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మహేశ్వర్ రెడ్డిల నేతృత్వంలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ రైతులకు మద్దతు ప్రకటిస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి రైతులకు మద్దతుగా ఒక భారీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న, వరి, జొన్న పంటలను కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులకు, హమాలీలకు రైతులే డబ్బులు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తూకం వేసిన ధాన్యపు బస్తాలను గోదాములకు తరలించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని, లారీలు ఎక్కించడానికి ఒక్కో బస్తాకు రూ.60 చొప్పున రైతుల వద్ద వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలకు నానిపోయిన పంటను ఎలాంటి తరుగు కోతలు లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొనుగోళ్లు సజావుగా సాగించలేక రైతుల వద్ద అన్ని రకాలుగా డబ్బులు వసూలు చేయడం ఈ ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులందరూ రైతులకు అండగా ఉంటారని, ప్రతి గింజ కొనేంత వరకు ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, నియోజకవర్గ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బాల్క సుమన్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే ముప్పు... కాంగ్రెస్ ఫైర్

- అధికారం కోల్పోయి అసహనంతో మాట్లాడుతున్న సుమన్
- రాజకీయ దివాళాతోనే సుమన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- ప్రజా ఆస్తులు కాల్చేయమంటారా?.. బాల్క వ్యాఖ్యలపై మండిపడ్డ కాంగ్రెస్
- బాల్క సుమన్ వ్యాఖ్యలను ఖండించిన మందమర్రి కాంగ్రెస్ నాయకులు

**మందమర్రి, మే 28, ప్రభాతవార్త**



చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి మాజీ ఎంపీ, మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో టీబీజీకేఎస్ నాయకుల కార్యవర్గ సమావేశం అనంతరం ఈ మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, మంచిర్యాల జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్ పైడిమల్ల నర్సింగ్, పట్టణ అధికార ప్రతినిధి సట్ల సంతోష్, సీనియర్ నాయకుడు సొత్కు సుదర్శన్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో టీబీజీకేఎస్ అనుబంధ సంఘాలను ఉపయోగించుకుని సింగరేణి కార్మికులను మోసం చేశారని ఆరోపించారు. కారుణ్య నియామకాల పేరుతో కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసి వారిని ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సింది పోయి, రాజకీయ నాయకులు మరియు కార్యకర్తల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. చెన్నూరు నియోజకవర్గంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసేలా, ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపేలా బాల్క సుమన్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. యువతను తప్పుదోవ పట్టిస్తూ మద్యానికి బానిసలుగా మార్చి రాజకీయ స్వలాభాల కోసం ఉపయోగించుకుంటున్నారని, యువత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, సింగరేణి భవనాలు, రైల్వే లైన్లపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాల అమలులో ముందంజలో ఉందని, ముఖ్యంగా రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని ఓర్వలేకే బాల్క సుమన్ ప్రభుత్వం పై అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇంకా ఇలాంటి వ్యాఖ్యలు కొనసాగిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్ గౌడ్, పట్టణ మహిళా అధ్యక్షురాలు గడ్డం రజిని, సేవాదళ్ పట్టణ అధ్యక్షుడు సొత్కు ఉదయ్, నేరువట్ల శ్రీనివాస్, ఎండీ పాషా, వీరన్న, బండి శంకర్, బేర వేణుగోపాల్, వనం నర్సయ్య, దుర్గం ప్రభాకర్, కొలిపాక సదానందం, బత్తుల సరిత, రాధ, సమత, పోచంపల్లి లక్ష్మీ, రెడ్డి ఆయులయ్య, ఎర్ర రాజు, తుంగపిండి శంకర్, ఆడెపు వేణు, మధు, సంపత్, రవి, రామ్, గాదె రాములు, నామిని ముత్తయ్య, రాజేష్, రాయబారపు కిరణ్, సాత్విక్, రాజు, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ ఇంచార్జీ చిప్పకుర్తి శశిధర్, సోషల్ మీడియా ఇంచార్జీ మూడరపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆసుపత్రుల్లో మార్పుల దిశగా అడుగులు

**సింగరేణి వ్యాప్తంగా 32 మంది వైద్యులు, 175 సిబ్బంది నియామకం**

**సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ రాజ్ కుమార్**

**బెల్లంపల్లి, మే 28, ప్రభాతవార్త**

బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పలు వార్డులు, క్యాజువాలిటీ విభాగాలను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆసుపత్రి సేవలపై సమీక్ష చేశారు. త్వరలోనే బెల్లంపల్లి ఆసుపత్రిలో వైద్య నిపుణులు మరియు అవసరమైన సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇంటర్వ్యూలు నిర్వహించామని, త్వరలోనే 32 మంది వైద్యులు, 175 మంది సిబ్బందిని నియమించనున్నట్లు వెల్లడించారు. కార్మిక సంఘాల అభ్యర్థన మేరకు ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. పాండురంగ చారి పాల్గొన్నారు.

# కొండ గొర్రెను రక్షించిన అటవీ శాఖ సిబ్బంది

**ఆసిఫాబాద్ టౌన్, మే 28, ప్రభాతవార్త :**



అటవీ జంతువుల సంరక్షణలో ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా అటవీశాఖ అధికారి సిహెచ్.బాలమణి కోరారు. అడవికి మేతకు వెళ్లిన మేకలతో పాటు గ్రామానికి వచ్చిన కొండ గొర్రెను రక్షించి అడవిలో వదిలిపెట్టిన సంఘటన గురువారం మండలంలోని జెండాగూడా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం వద్ద చోటుచేసుకుంది. జిల్లా అటవీశాఖ అధికారికి వచ్చిన సమాచారంతో అటవీ సెక్షన్ అధికారి మహేందర్ సిబ్బందితో కలిసి గ్రామానికి వచ్చిన కొండగొర్రెను రక్షించి దానికి ఆహారం అందించి అడవిలో వదిలిపెట్టారు. కొండ గొర్రె రక్షించడానికి సహాయం అందించిన మాజీ ఎంపిటిసి దంపతులు దుర్గం నిర్మల సాయినాథ్ లను జిల్లా అటవీ శాఖ అధికారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు ప్రకాష్, రాజేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# కోల్ ఇండియా కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉద్యోగుల సంక్షేమానికి వెచ్చిస్తున్నాం

## ఆర్.కె 8 డిస్పెన్సరీలో నూతన ఫిజియోథెరపీ గదిని ప్రారంభించిన డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు

**నస్పూర్, మే 28, ప్రభాతవార్త**

మనకంటే పదింతలు పెద్దదైన కోల్ ఇండియా కంటే నాలుగు రెట్లు అదనంగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమానికి, ముఖ్యంగా వైద్య సదుపాయాల కల్పనకు సింగరేణి సంస్థ వెచ్చిస్తోందని డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా పర్యటనలో భాగంగా గురువారం ఆర్.కె 8 డిస్పెన్సరీలో నూతనంగా నిర్మించిన ఫిజియోథెరపీ అదనపు గదిని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్తో కలిసి ఆయన ప్రారంభించారు. నూతన గదిలో అదనంగా ఏర్పాటు చేసిన బెడ్లు, అత్యాధునిక ఫిజియోథెరపీ యంత్రాలను పరిశీలించిన అనంతరం రోగులతో మాట్లాడి సేవలపై ఫీడ్‌బ్యాక్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ప్రకృతికి విరుద్ధంగా గనుల్లో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సంస్థ పెద్ద సంఖ్యలో సొంత ఆసుపత్రులను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు సకల సదుపాయాలు కల్పిస్తున్న కన్నతల్లి లాంటి సింగరేణిని, ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహిస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని డైరెక్టర్ స్పష్టం చేశారు. డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 40 వేలకు పైగా మంది సేవలు పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ నొప్పులు, ప్రమాదాల వల్ల చికిత్స పొందుతున్న ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ ప్రైవేట్ సెంటర్ల కంటే ఇక్కడే మెరుగైన వైద్యం లభిస్తోందని, దీనివల్ల వేలాది రూపాయలు ఆదా అవుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

అనంతరం శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణిలోనే బెస్ట్ ఫిజియోథెరపీ సెంటర్‌గా ఆర్.కె 8 డిస్పెన్సరీ నిలుస్తోందని కొనియాడారు. ప్రైవేట్‌లో రోజుకు వెయ్యి నుండి రెండు వేల రూపాయల వరకు ఖర్చయ్యే వైద్య సర్వీసులను, ఇక్కడ అత్యాధునిక యంత్రాలతో సిబ్బంది ఉచితంగా, ఎంతో ఓపికతో అందిస్తున్నారని అభినందించారు. ఈ కేంద్రంలో ఏసీలను ఏర్పాటు చేయాలని డైరెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏజీఎం (ఈ అండ్ ఎం) రమణ రావు, సీఎంఓ కిరణ్ రాజ్ కుమార్, డిప్యూటీ సీఎంఓలు మధు కుమార్, రమేష్ బాబు, ఆర్.కె 7 గ్రూప్ ఏజెంట్ కుర్మ రాజేందర్, ఆర్.కె 5 గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డాక్టర్లు లోక్ నాథ్ రెడ్డి, మురళి, శివకుమార్, డిస్పెన్సరీ సిబ్బంది పాల్గొన్నారు.

# సమన్వయమే సింగరేణి విజయానికి బలం

- విభాగాల పనితీరుపై సమగ్ర సమీక్ష - లక్ష్య సాధనకు స్పష్టమైన దిశానిర్దేశం
- మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

మందమర్రి, మే 28, ప్రభాతవార్త



సింగరేణి సంస్థ నిర్దేశించుకున్న ఉత్పత్తి, ఆర్థిక మరియు పరిపాలనా లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలంటే అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయడం అత్యంత కీలకమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ పేర్కొన్నారు. గురువారం రోజున ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో పర్సనల్ (సిబ్బంది), అకౌంట్స్ మరియు సివిల్ విభాగాల ఉన్నతాధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల వారీగా ప్రస్తుతం అమలవుతున్న పనులు, సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై విపులంగా చర్చ జరిగింది. గనుల పనితీరు మెరుగుపరచడం, సిబ్బంది నిర్వహణలో పారదర్శకత, ఖర్చుల నియంత్రణ, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై జీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. పర్సనల్ విభాగం సిబ్బంది సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, ఉద్యోగుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. అకౌంట్స్ విభాగం ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ఖర్చులను నియంత్రణలో ఉంచి సంస్థ ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని ఆదేశించారు. సివిల్ విభాగం గనులు మరియు కార్యాలయాలకు సంబంధించిన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి ప్రగతిలో ప్రతి విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. అధికారులు, సిబ్బంది ఒకరికొకరు సహకరించుకుంటూ పనిచేస్తేనే సంస్థ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి మందమర్రి ఏరియాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలి అని అన్నారు. అలాగే భద్రతా ప్రమాణాల అమలు, కార్మిక సంక్షేమం, పనుల వేగవంతం వంటి అంశాలపై కూడా ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్‌లో మరింత సమన్వయంతో పనిచేసి సంస్థ ప్రతిష్టను పెంచాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో ఏజీఎం (ఎఫ్ అండ్ ఎ) ఆర్వీఎస్ఆర్కే ప్రసాద్, డీజీఎం పర్సనల్ సీహెచ్ అశోక్, డీజీఎం ఐఈడి కిరణ్ కుమార్, సివిల్ ఎస్.ఈ శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణతో పాటు అన్ని గనుల సంక్షేమ అధికారులు, సివిల్, అకౌంట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలి

మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

జైపూర్, మే 28, ప్రభాతవార్త



ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయబడి కేటాయించబడిన రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం రామారావుపేట లోని సుముఖ గోదాము, హాజీపూర్ మండలంలోని గాయత్రి రైస్ మిల్లును అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి ధాన్యం కొనుగోలును చేపట్టడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యం దిగుమతిని వేగవంతంగా చేపట్టాలని, రోజుకి కనీసం 40 నుంచి 50 లారీల ధాన్యం దిగుమతిని చేయాలని తెలిపారు. ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీలను సమకూర్చడం జరిగిందని, దిగుమతి త్వరితగతిన పూర్తి చేసి ఈ నెలాఖరులోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

తాండూర్, మే 28, ప్రభాతవార్త :

తాండూర్ మండలంలోని ముస్లిం మైనార్టీ సోదరులు గురువారం బక్రీద్ పండుగ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. తాండూర్ గ్రామ జామా మసీద్ వారి ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి ఈద్గా వద్ద ముస్లిం సోదరులు బక్రీద్ పండగ ప్రార్థనలు సామూహికంగా నిర్వహించారు ఈ సందర్భంగా జామా మసీద్ ఇమామ్ అబ్దుల్ కరీం సాబ్ ఈద్ ఉల్ అజహ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి సోదర భావంతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా ముస్లిలు ఒకరినొకరు అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



## గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల, సిఐటియు మండల కమిటీ సమావేశం

వాంకిడి, మే 28, ప్రభాతవార్త :



వాంకిడి మండల గ్రామ పంచాయతీ కార్మికుల మరియు సిఐటియు మండల కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్ హాజరై మాట్లాడుతూ మండలంలో అన్ని జిపి లలో పెండింగ్ వేతనాలు మూడు నెలలు నాలుగు నెలలు ఐదు నెలలు పెండింగ్లో ఉన్నటువంటి పరిస్థితి ఉంది వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని,రాష్ట్ర ప్రభుత్వం నిన్న ప్రకటించిన విధంగా పంచాయతీ సిబ్బందికి ఒకటో తారీకే గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని గతంలో ప్రకటన చేశారు తప్ప అమలు కాలేదని ఈసారైనా ప్రకటించిన విధంగా అమలు అయ్యేలాగా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని పంచాయతీ సిబ్బందికి ఇన్సూరెన్స్ పదిలక్షలు కల్పించాలని ప్రతి సంవత్సరం సానిటేషన్ కిట్స్ యూనిఫార్మ్ మాస్ సోప్స్ మాస్క్ హ్యాండ్ బ్లౌజ్ ఆయిల్స్ తో కూడిన శానిటేషన్ కిట్స్ ప్రతి సంవత్సరం పారిశుద్ధ కార్మికులకు అంద చేయాలని ప్రభుత్వం ఎలక్షన్ సందర్భంలో ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని ఆలోపు సుప్రీంకోర్టు ఇచ్చిన జీవో ప్రకారం కనీస వేతనం 26,000 వేలు ఇవ్వాలని ఇచ్చే వేతనం ఒకటో తేదీనే కార్మికుల ఖాతాలోకి జమ కావాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని ఈ సమస్యలను తొందర్లో పరిష్కరించాలని లేని పక్షంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన నిర్ణయ ప్రకారం కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని జూన్ ఒకటో తారీకు అన్ని మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు తో పాటు పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎంఏ సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

తాండూర్, మే 28, ప్రభాతవార్త :



తాండూర్ గ్రామంలో ఎంఎ సంస్థ వారి ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎండి దావూద్ కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం బక్రీద్ పండుగ రోజున పేద ప్రజలకు అన్నదానం నిర్వహిస్తారు. వేసవికాలం ప్రతి ఏటా చల్లటి మంచినీళ్ల పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమంలో ఎంఎ సంస్థ సభ్యులు జకియ, ఇలియాస్ , ఈసా, సుబుర్, ఇబ్రహీం, సిద్దిక్, జుబేర్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి, మే 28, ప్రభాతవార్త

మిడిల్ పోల్ పనుల నిర్వహణ నేపథ్యంలో నీల్వాయి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఒక ప్రకటనలో తెలిపారు. గొర్లపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాలకు నీల్వాయి, గొర్లపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్, మంగనపల్లి గ్రామాల ప్రజలు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



## ఘనంగా వీర సావర్కర్ జయంతి వేడుకలు

- ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్

భైంసా, మే 28, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని భైంసా జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో స్వాతంత్ర్య ఉద్యమ నేత వినాయక్ దామోదర్ సావర్కర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ నాయకుడు మోహన్ రావు పాటిల్ పూజ చేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య సమరంలో సావర్కర్ చేసిన సేవలను, దేశం కోసం ఆయన పడ్డ కష్టాలను, ఆశయాలను గుర్తు చేసుకున్నారు. నేటి యువత ఆయన ఆశయాలను అనుసరిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ట్రస్ట్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బక్రీద్ సందర్భంగా భైంసా పట్టణంలో పటిష్ట పోలీస్ బందోబస్తు

- ఎస్పీ డా. జి. జానకి షర్మిల

భైంసా, మే 28, ప్రభాతవార్త:



బక్రీద్ పండుగ సందర్భంగా భైంసా పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన పటిష్ట పోలీస్ బందోబస్తును నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్ శాఖ తరపున పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే ఇరు వర్గాల ప్రజలతో శాంతి కమిటీ సమావేశాలను కూడా నిర్వహించినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను, అసత్య ప్రచారాలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని సూచించారు. బక్రీద్ పండుగను అందరూ ప్రశాంతమైన, శాంతియుత వాతావరణంలో జరుపుకునేలా అన్ని రకాల కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామని స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణలో ఎస్పీతో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, సాయి కుమార్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చెన్నూరు పట్టణంలో పిచ్చికుక్క బీభత్సం

పది మందిపై దాడి, పదేళ్ల పాపకు తీవ్ర గాయాలు

బాధితులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూరు, మే 28, ప్రభాతవార్త



చెన్నూరు పట్టణంలో పిచ్చికుక్క బీభత్సం సృష్టించింది. ఎదురైన వారిని కరుస్తూ భయభ్రాంతులకు గురి చేసింది. పట్టణంలోని పెద్దవాడ, నల్గొండ పోచమ్మ వాడ, ఇందిరా నగర్ వార్డుల్లో కలిపి పదిమందిని కరిచి గాయపరిచింది. ఇందులో పదేళ్ల పాపకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాధితులను చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు మరోమారు జరగకుండా చూడాలని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, సంబంధిత అధికారులకు సూచించారు.

# నూరు శాతం బొగ్గు ఉత్పత్తి సాధించాలి

## శ్రీరాంపూర్ ఓసీపీలో 12 టన్నుల నూతన క్రేన్‌ను ప్రారంభించిన డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు

**నస్పూర్, మే 28, ప్రభాతవార్త**



గత ఏడాది శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని రెండు ఉపరితల గనుల్లో కాంట్రాక్టు ఒప్పంద సమస్యల కారణంగా ఆశించిన ఉత్పత్తి జరగలేదని, ఈసారి ముందస్తు ప్రణాళికలతో నూటికి నూరు శాతం ఉత్పత్తి సాధనకు కృషిచేయాలిని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శ్రీరాంపూర్ ఉపరితల గని ఇంజనీరింగ్ విభాగంలోని ఎం సెక్షన్‌లో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 12 టన్నుల క్రేన్‌ను ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని రిబ్బన్ కట్ చేసిన అనంతరం ఉద్యోగులు, మహిళా కార్మికులతో మాట్లాడారు. కోట్లు వెచ్చించి అందుబాటులోకి తెచ్చిన యంత్రాల వినియోగం విషయంలో ఆపరేటర్లు, సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించి పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. యంత్రాలను పాడుచేస్తే ఉత్పత్తికి ఆటంకం కలగడంతో పాటు మరమ్మతులకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో మహిళా ఉద్యోగులు సేవలు అందించడం అభినందనీయమని, మరింత నిబద్ధతతో విధులు నిర్వహించాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యసాధనలో మెజారిటీ వాటా ఎస్సార్పీ ఓసీదేనని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. గత ఏడాది కాంట్రాక్ట్ సమస్యల వల్ల ఉత్పత్తి తగ్గినప్పటికీ, ఈసారి ఓబీ కాంట్రాక్టు సమస్యలు కొలిక్కి వచ్చినందున నూటికి నూరు శాతం ఉత్పత్తి సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అనంతరం ఓసీ గనిలోని పని ప్రదేశాలలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు పనులను డైరెక్టర్, జీఎం పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రైవేట్ ఓబీ కాంట్రాక్టు సిబ్బందితో మాట్లాడి ప్రతిరోజూ ఒప్పందం మేరకు ఓబీ తొలగింపు జరగాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్రం, ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అధికారుల సంఘం బ్రాంచ్ అధ్యక్షులు కే. వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్సార్పీ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ సీహెచ్. వెంకటేశ్వర్లు, మేనేజర్ ఐ. శ్రీనివాస్, ప్రాజెక్టు ఇంజనీర్ నాగరాజు, డీజీఎం (సేఫ్టీ) విజయ్ కుమార్, సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్ రావు, అధికారులు, సూపర్వైజర్లు, యూనియన్ల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినం శాంతి, సోదరభావానికి ప్రతీక

## - ఈద్గాలు, దర్గాల వద్ద పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మేయర్ ధరణి మధూకర్, నగర అధ్యక్షుడు తూముల నరేష్

**మంచిర్యాల,మే 28, ప్రభాతవార్త**



బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు మంచిర్యాల నగర మేయర్ ధరణి మధూకర్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో బక్రీద్ పండుగ త్యాగం, సేవాభావం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ప్రేమ, ఐక్యత, సోదరభావం పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని వారు అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవ భావంతో కలిసి మెలిసి జీవించడం భారతదేశ సంస్కృృతికి నిదర్శనమని తెలిపారు. పేదలకు సహాయం చేయడం, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం బక్రీద్ పండుగ ప్రధాన సందేశమని పేర్కొన్నారు. నగర ప్రజలందరూ ఆనందోత్సాహాలతో, శాంతియుత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా నగరంలో అవసరమైన పారిశుధ్య, తాగునీరు, విద్యుత్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మసీదుల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. బక్రీద్ పర్వదినం ప్రతి ఇంటా సుఖశాంతులు నింపాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలగాలని మేయర్ ధరణి మధూకర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్ ఆకాంక్షించారు.

# దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానేత వీర్ సావర్కర్

## స్వాతంత్ర్య పోరాట యోధుడికి ఘన నివాళులు... మాజీ ఆర్మీ దంపతులు

**మందమర్రి, మే 28, ప్రభాతవార్త**



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ (వీర్ సావర్కర్) 143వ జయంతి సందర్భంగా మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్ అండ్ పీసీ ఉద్యోగి రాజేష్ పిప్‌హల్, రాణి పిప్‌హల్ దంపతులు తమ నివాసంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్ సావర్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వీర్ సావర్కర్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత దేశభక్తుడని కొనియాడారు. మే 28, 1883న మహారాష్ట్రలోని భాగూర్ గ్రామంలో జన్మించిన సావర్కర్, చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలతో ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. పూణేలో చదువుకుంటున్న సమయంలో“మిత్ర మేళా” సంస్థను స్థాపించి, అనంతరం దానిని “అభినవ్ భారత్”గా విస్తరించారని తెలిపారు. లండన్‌లో బారిస్టర్ విద్యాభ్యాసం చేస్తూనే“ఇండియా హౌస్” ద్వారా విప్లవకారులను సంఘటితం చేశారని, నాసిక్ కలెక్టర్ జాక్సన్ హత్య కేసులో ఆరోపణలతో బ్రిటిష్ ప్రభుత్వం 1910లో అరెస్ట్ చేసి రెండు యావజ్జీవ కారాగార శిక్షలు విధించిందన్నారు. అండమాన్ సెల్యులార్ జైలులో 12 సంవత్సరాల పాటు కఠిన కారాగార శిక్ష అనుభవిస్తూ కూడా దేశభక్తి భావజాలాన్ని వ్యాప్తి చేశారని తెలిపారు. ది ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ 1857, హూ ఈజ్ ఏ హిందూ వంటి రచనల ద్వారా జాతీయవాద భావాలను ప్రజల్లో నింపారని పేర్కొన్నారు. అంటరానితనం నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం కూడా సావర్కర్ కృషి చేశారని అన్నారు. దేశం కోసం జీవితాంతం పోరాడిన వీర్ సావర్కర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, సీహెచ్ మహేందర్, రాజు, శంకర్, డి. తిరుపతి, రోజా, సుశీల, లక్ష్మి, చంద్రకళ, నిర్మల, రజిత, శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కార్యదర్శి నియామకం

## ధన్యవాదాలు తెలిపిన నూతన కార్యదర్శి ఎల్తూరి శంకర్

**బెల్లంపల్లి, మే 28, ప్రభాతవార్త**

తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టియువి) రాష్ట్ర కార్యదర్శిగా తనను నియమించిన రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ, వైస్ చైర్మన్ తొడేటి శంకర్ గౌడ్‌లకు నూతనంగా నియమితులైన రాష్ట్ర కార్యదర్శి ఎల్తూరి శంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారులను ఐక్యపరచి, వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, పరిష్కారానికి కృషి చేయడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే, సంస్థ బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తూ, గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యకర్తలతో సమన్వయం పెంచి, తెలంగాణ హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ప్రజల సేవే పరమావధిగా భావిస్తూ, ప్రతి సమస్యపై స్పందించే నాయకుడిగా నిలబడతానని చెప్పారు. తనకు ఈ బాధ్యతను అప్పగించిన నాయకత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతూ, కార్యకర్తలు, ప్రజల సహకారంతో సంస్థను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు.



ఈద్గా,దర్గాల వద్ద తనిఖీ చేస్తున్న డిసిపి బృందం

# అర్ధరాత్రి మసీదులు, ఈద్గాలు, చెక్‌పోస్టులను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

**మంచిర్యాల, మే 28,ప్రభాతవార్త**

మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల, మందమర్రి,బెల్లంపల్లి తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి మసీదులు, ఈద్గాలు, చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.పండుగ విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కడైనా చిన్న ఘటన జరిగినా వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావాలని పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు.బక్రీద్ (ఈద్‌ఉల్‌అధా) పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మంచిర్యాల జోన్ పరిధిలోని మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ తెలిపారు. మతసామరస్యానికి భంగం కలిగించేలా రెచ్చగొట్టే పోస్టులు చేయడం, అసత్య ప్రచారాలు లేదా వదంతులు వ్యాప్తి చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం స్థానిక పోలీసులను లేదా డయల్ 100ను సంప్రదించాలని సూచించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గేదెల హల్‌చల్

**చింతలమానేపల్లి, మే 28, ప్రభాతవార్త,**

మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బర్లు స్వైర విహారం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యపు సంచులపైకి ఎక్కి ధాన్యం తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని రైతులు ఆరోపించారు. వెంటనే భద్రతా చర్యలు చేపట్టి రైతులకు నష్టం కలగకుండా చూడాలని కోరుతున్నారు.

